క్లుప్తంగా

అక్రమ నిర్మాణం తొలగింపు



నిర్మాణాన్ని తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు రాజీవ్‌నగర్ కాలనీలో శ్రీ శాంతినికేతన్ స్కూల్‌పై నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అదనపు అంతస్తు స్లాబ్‌ను జీవీఎంసీ అధికరాలు మంగళవారం తొలగించారు. అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తప్పవని, ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపడితే స్థానికులు సమాచారం అందించాలని కోరారు.

వార్డులో సమస్యల పరిశీలన

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు ఏకలవ్య కాలనీలో ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మంగళవారం పర్యటించి స్థానిక సమస్యలు పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి కాలనీలో ఉన్న సమస్యలు తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సీసీ రోడ్ల నిర్మాణంతోపాటు ఖాళీ స్థలంలో కమ్యూనిటీ హాల్, ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ) అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. కాలనీపై పోలీసులు ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. జోనల్ కమిషనర్ బి.రాము, సీఐ ఉమాకాంత్, రెవెన్యూ అధికారులు, జీవీఎంసీ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్ల వద్ద ప్రమాదాలు



ఆర్టీవో కార్యాలయం సమీపంలో తెలుపు రంగు వేయకపోవడంతో కనిపించని స్పీడ్ బ్రేకర్

మురళీనగర్: మురళీనగర్ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లు ప్రమాదకరంగా తయారయ్యాయి. బ్రేకర్లు వేసిన సిబ్బంది వాటికి తెలుపు రంగు వేయకుండా వదిలేశారు. దీంతో వాహన చోదకులు దగ్గరకు వచ్చే వరకు స్పీడ్ బ్రేకర్లు కనిపించడం లేదు. వాటి దగ్గరకు రాగానే సడన్‌గా బ్రేకులు వేయడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. జాతీయ రహదారిని అనుకుని సేవా మార్గంలో ఆర్ అండ్ బీ, ఆర్‌టీవో కార్యాలయాన్ని కలిపే చోట స్పీడ్ బ్రేకర్లకు తెలుపు రంగులు వేయలేదు. అధికారులు స్పందించి ప్రమాదాలు నివారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

డీజిల్ లోకో షెడ్‌లో తనిఖీలు



డీజిల్ లోకో షెడ్‌లో పర్యటిస్తున్న డీఆర్ఎం లలిత్‌బోహ్రా, అధికారులు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్‌బోహ్రా మంగళవారం డీజిల్ లోకో షెడ్‌లో పర్యటించారు. గత ఆరు నెలల్లో లోకో షెడ్ పనితీరు, సామర్థ్యం, జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. సరకు రవాణా, లోడింగ్ సామర్థ్యం పెంపుదల వంటి కీలక విషయాలపై సమీక్షించారు. ఈ పర్యటనలో సీనియర్ డివిజినల్ మెకానికల్ ఇంజినీర్ (డీజిల్) ఎంకే సాహూ, సీనియర్ డివిజినల్ ఫైనాన్స్ మేనేజర్ ఎం.హరనాథ్, సూపర్‌వైజర్లు, ప్లానింగ్, ప్రాజెక్ట్స్ సిబ్బంది పాల్గొన్నారు.

బెంగళూరు-కామాఖ్య ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: ఈస్టర్న్ రైల్వే, అసన్ సోల్ డివిజన్ పరిధిలో జరుగుతున్న భద్రతాపరమైన ఆధునికీకరణ పనుల నిమిత్తం ఆయా తేదీల్లో బెంగళూరు-కామాఖ్య-బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌ను దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. నవంబర్ 1, 8, 15, 22వ తేదీల్లో ఎస్ఎంవీటీ బెంగళూరు-కామాఖ్య(12551) ఏసీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, నవంబరు 5,12,19వ తేదీల్లో కామాఖ్య-ఎస్ఎంవీటీ బెంగళూరు (12552) ఏసీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లు రెగ్యులర్ మార్గంలో కాకుండా వయా అసన్‌సోల్, అండల్, సైంథియా స్టేషన్ల మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

వర్క్‌షాప్‌లతో మెరుగైన నైపుణ్యం

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల బోటనీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం టెక్నిక్స్ ఇన్ ప్రాపగేషన్ ఆఫ్ మెడిసినల్ అండ్ ఆర్నమెంటల్ ప్లాంట్ అనే అంశంపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో రీసోర్స్ పర్సన్, ఏయూ క్యూరేటర్ డాక్టర్ జె.ప్రకాష్ పాల్గొని కళాశాల విద్యార్థినులకు గ్రాఫ్టింగ్, లేయరింగ్ తదితర ప్రాపగేషన్ టెక్నిక్స్ చెప్పి, విద్యార్థినులతో వాటిని చేయించారు. డాక్టర్ టీఎంప నివేదిత తదితరులు పాల్గొన్నారు.

నగదు వద్దు.. ఆన్‌లైన్ ముద్దు

నగదు లావాదేవీలకు క్రమంగా చెల్లు

నో క్యాష్.. అంతా ఆన్‌లైన్

చిల్లర ఇబ్బందులకు చెక్





క్యూఆర్ కోడ్‌తో కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారి

చిల్లర సమస్య లేదు..



గతంలో చిల్లర సమస్య అధికంగా ఉండేది. చిల్లర కోసం బేరాలు వదులుకునే వాళ్లం. ఫోన్ పే, గూగుల్ పే, క్యూఆర్ కోడ్‌తో చిల్లర సమస్య లేకుండా సాఫీగా వ్యాపారాలు చేస్తున్నాం. ఆర్థిక లావాదేవీలు శ్రమ లేకుండా జరిగిపోతున్నాయి.

–దాసరి మల్లేశ్వరరావు, హోటల్ వ్యాపారి, కంచరపాలెం



చాట్ దుకాణంలో ఫోన్ పే చేస్తున్న వినియోగదారుడు

కంచరపాలెం: బయటికి వెళ్తున్నారా? చేతిలో నగదు లేకపోయినా ఫర్వాలేదు.. అకౌంట్‌లో డబ్బు, చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంటే చాలు కావాల్సిన వస్తువులు కొనుగోలు చేయొచ్చు. నచ్చిన ఆహార పదార్థాలు తినొచ్చు. గతంలో మాల్స్, పెద్ద వ్యాపార సంస్థలకే పరిమితమైన డిజిటల్ పేమెంట్స్ రానురాను చిరువ్యాపారుల చెంతకు సైతం చేరాయి. నగదు లావాదేవీలు తగ్గుతుండడంతో నగర మార్కెట్ల నుంచి గల్లీ మార్కెట్ల వరకు ఎక్కడ చూసినా ఆన్‌లైన్ చెల్లింపులే కనిపిస్తున్నాయి.

పెరిగిన ఆన్‌లైన్ చెల్లింపులు, వసూళ్లు..

ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం, అమెజాన్ పే, భారత్ పే వంటి యాప్‌లతో అన్నిచోట్లా ఆన్‌లైన్ చెల్లింపులు పెరిగాయి. కిరణా, ఫ్యాన్సీ, మందులు, పెట్రోల్ బంకులు, సెలూన్‌లు, హోటళ్లు, మిఠాయి దుకాణాలు, మొబైల్, డీటీహెచ్ రీచార్జిలు, విద్యుత్, గ్యాస్ బిల్లుల వంటివన్నీ ఈ యాప్‌ల ద్వారానే జరుగుతున్నాయి. పేమెంట్ యాప్‌లు వినియోగిస్తున్న వారిలో యువత ముందు వరుసలో ఉందని ఆయా సంస్థల ప్రతినిధులు చెబుతున్నారు.

డిజిటల్ బ్యాంకింగ్‌కు ప్రాధాన్యం..

బ్యాంకుల్లో కూడా డిజిటల్ బ్యాంకింగ్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో నగదు లావాదేవీలు చాలా వరకు తగ్గుతున్నాయి. వినియోగదారులు అధికంగా నగదు రహిత ట్రాన్సాక్షన్లు చేస్తూ ఇంటి వద్ద నుంచే అన్ని రకాల సేవలు పొందుతున్నారు.



కంచరపాలెం కూడలిలో దుస్తులు కొనుగోలు చేస్తున్న మహిళలు

దీనివల్ల బ్యాంకులకు వచ్చే ఖాతాదారుల సంఖ్య తగ్గిందని బ్యాంకుల్లో పని చేసే ఉద్యోగులు అంటున్నారు. మరోపక్క రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిజిటల్ పేమెంట్లను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటోంది. శతశాతం డిజిటల్ జిల్లాగా మార్చేందుకు మరింతగా కృషి చేస్తోంది.

అధిక ప్రయోజనకరం..

టీ స్టాళ్లు, కాకా హోటళ్లు, తోపుడుబళ్లు, మూడుచక్రాల సైకిళ్లపై, రోడ్డు పక్కన, ఇంటింటికీ తిరుగుతూ ఫాస్ట్‌ఫుడ్స్, కూరగాయలు, పండ్లు వంటివి అమ్మే వ్యాపారులకు ఈ ఆన్‌లైన్ చెల్లింపులు ప్రయోజనకరంగా మారాయి. ప్రధానంగా చిల్లర సమస్యతో వీరికి బేరాలు పోతుంటాయి. డిజిటల్ పేమెంట్ల పుణ్యమా అని చిల్లర సమస్య తీరుతుండటంతో చిరువ్యాపారులు సైతం వీటివైపు మొగ్గు చూపుతున్నారు. పేమెంట్ యాప్‌లకు సంబంధించిన క్యూఆర్ కోడ్లను ఆయా సంస్థల ఏజెంట్లు క్షణాల్లో అందజేస్తున్నారు. ఇప్పుడు ఏ దుకాణం వద్ద చూసినా క్యూఆర్ కోడ్ స్టిక్కర్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. గతంతో పోలిస్తే చాలా వరకు వినియోగదారులు ఆన్‌లైన్ పేమెంట్ చేసేందుకే ఆసక్తి చూపిస్తున్నారని, వీటి వల్ల చిల్లర సమస్య లేదని వ్యాపారులు అంటున్నారు.

కొత్తలో భయపడే వాళ్లం..



క్యూఆర్ కోడ్‌తో కస్టమర్ స్కానింగ్ చేసేటప్పుడు డబ్బులు ఖాతాలో పడ్డాయో లేదో అని భయపడే వాళ్లం. ఇప్పుడు ఆ భయం పూర్తిగా పోయింది. బ్యాంకు వాళ్ల అవగాహన కల్పించడంతో ఆర్థిక మోసాలు జరుగుతాయన్న ఆందోళ పోయింది. వ్యాపారాలు బాగా సాగుతున్నాయి.

– నమ్మి సరోజిని, వ్యాపారి, కంచరపాలెం

స్టీకర్లతో మోసాలకు చెక్..

ఆన్‌లైన్ చెల్లింపుల్లో ఉపయోగాలతో పాటు ఆదమరిస్తే మోసాలకూ ఆస్కారం ఉందని నిపుణులు అంటున్నారు. వీటిపై అవగాహన లేని వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని ఆన్‌లైన్ మాయగాళ్లు మోసాలకు పాల్పడుతుంటారు. సరుకులు కొనుగోలు చేసిన తర్వాత వేరే వారికి నగదు బదిలీ చేస్తారు. సెల్‌ఫోన్ స్క్రీన్‌పై వచ్చిన ట్రాన్సాక్షన్ సక్సెస్‌ఫుల్ మెసేజ్‌ను దుకాణదారుడికే అమౌంట్ పే చేసినట్లు చూపించి అక్కడి నుంచి జారుకుంటారు. అయితే మార్కెట్లోకి వచ్చిన క్యూఆర్ కోడ్ స్పీకర్ బాక్సులు ఇటువంటి అక్రమాలకు చెక్ పెడుతున్నాయి. ఆన్‌లైన్ చెల్లింపు జరగ్గానే ఎంత మొత్తం దుకాణదారు ఖాతాకు జమ అయిందో స్పీకర్‌లో వినిపిస్తుంది. దీంతో డిజిటల్ మోసాలకు అడ్డుకట్ట పడిందని వ్యాపారులు అంటున్నారు.



కిరాణా దుకాణంలో క్యూఆర్ కోడ్‌తో ఆన్‌లైన్ పేమెంట్ చేస్తున్న మహిళ

యూపీఐ పేమెంట్లతో జాగ్రత్త

- యూపీఐ పేమెంట్లు చేసేటప్పుడు వినియోగదారులు కాస్త జాగ్రత్త వహించి దిగువ అంశాలు గుర్తుంచుకోవాలి.
- నగదు పంపేందుకు మాత్రమే క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాలి. రిసీవ్‌కు స్కాన్ అవసరం లేదు.
- యూపీఐ పిన్ ఎవరికీ చెప్పొద్దు. మీరు పేమెంట్ చేసేటప్పుడు మాత్రమే పిన్ ఎంటర్ చేయాలి.
- కొత్త నంబర్లు క్యూఆర్ కోడ్‌లకు నగదు పంపే ముందు అక్కడ వచ్చిన పేరు వారిదేనా కాదా చెక్ చేయాలి.
- అపరిచితుల నుంచి ఆఫర్ల పేరిట వచ్చే లింక్‌లు క్లిక్ చేయవద్దు.
- ఫోన్ హ్యాక్ అయ్యే చాన్స్ ఉన్నందున వాటిలో బ్యాంకింగ్ వివరాలను సేవ్ చేయొద్దు.

లలితాపీఠంలో 22 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తదితరులు

సీతంపేట: స్థానిక అక్కయ్యపాలెంలోని శ్రీలలితాపీఠంలో ఈ నెల 22 నుంచి అక్టోబరు 2వ వరకు దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం పీఠం దర్బారు హాల్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి ఆశీస్సులతో ఈ నెల 22న ఉదయం 8:30 గంటలకు అమ్మవారి సన్నిధిలో కలశ స్థాపనతో ఉత్సవాలు ప్రారంభిస్తామని తెలిపారు. లక్ష్మీ గణపతి హోమం, చండీ హోమం నిర్వహిస్తామన్నారు. 23న శ్రీసుబ్రహ్మణ్యస్వామి, సర్పసూక్త హోమం, మన్యుపాశుపత హోమం, 24న శ్రీప్రత్యంగిర భద్రకాళి హోమం, 25న దత్తాత్రేయ దక్షిణామూర్తి హోమం, 26న లలితాదేవి హోమం, మహాలక్ష్మి షడక్షరి, ఖడ్గమాల హోమం, 27న వారాహిదేవి హోమం, రాజశ్యామల హోమం, 28న మహా సౌర అరుణహోమం, 29న సరస్వతి దేవి, గాయత్రి దేవి హోమం, 30న కాళీహోమం, బగళాముఖి హోమం, అక్టోబరు 1న ఉదయం 10 గంటలకు వనదుర్గా, శ్రీవిద్యా హోమం, 2న దశమి రోజున 108 ద్రవ్యాలతో మహా పూర్ణాహుతి, చండీహోమం, లఘు పూర్ణాహుతి నిర్వహిస్తామని తెలిపారు. రోజూ ఉదయం చండీ పారాయణ, సాయంత్రం 3:30 గంటలకు చండీ హోమం, సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తామని తెలిపారు. ఈ విశేష పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఓజోన్ పరిరక్షణ అందరి బాధ్యత



ఓజోన్ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న సిఫా ప్రతినిధులు, ఉపాధ్యాయులు

సీతంపేట: ఓజోన్ పొర పరిరక్షణ అందరి బాధ్యత అని సిఫా ట్రస్టు సీఈవో డాక్టర్ శశిప్రభ అన్నారు. అంతర్జాతీయ ఓజోన్ డే సందర్భంగా స్థానిక రేసపువానిపాలెంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓజోన్ పొర పరిరక్షణ కోసం 167 దేశాలు కృషి చేస్తున్నాయని తెలిపారు. అందరూ విరివిగా మొక్కలు నాటాలన్నారు. గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం మాట్లాడుతూ ప్రకృతి ఆధారిత పంటలు పండించాలని కోరారు. ప్లాస్టిక్ వస్తువులు, పాలిథిన్‌కు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం పోర్టు ట్రస్టు అందజేసిన మొక్కలను స్కూల్ ఆవరణలో నాటారు. కార్యక్రమంలో హెచ్ఎం అరుణకుమారి, యాక్షన్ ఎయిడ్ ప్రతినిధి ఐ.కృష్ణకుమారి, సిఫా ప్రతినిధులు హేమ, భాస్కర్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల నిర్వహణలో అలసత్వం తగదు

జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్



జోనల్ కమిషనర్లు, అధికారులకు ఆదేశాలిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్

తాటిచెట్లపాలెం: పారిశుధ్య పనుల నిర్వహణలో అలసత్వం వహించరాదని, నిర్ణీత సమయానికే అధికారులు, సిబ్బంది, పారిశుధ్య కార్మికులు విధులకు హాజరు కావాలని, వార్డు శానిటేషన్ కార్యదర్శులు అప్రమత్తతతో విధులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మంగళవారం జోన్-3, జోన్-5లోని పలు వార్డులు, నరసింహనగర్ రైతు బజార్ ప్రాంతాల్లో పర్యటించారు. పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎక్కడా వ్యర్థాలు లేకుండా చూడాలని ఆదేశించారు. పారిశుధ్య కార్మికులు, వార్డు సచివాలయ శానిటరీ కార్యదర్శుల హాజరును పరిశీలించారు. పారిశుధ్య కార్మికులు సచివాలయం పరిధిలో ఎక్కడెక్కడ విధులు నిర్వహిస్తున్నారో శానిటరీ కార్యదర్శులకు అవగాహన కలిగి ఉండాలన్నారు. అందుకు సచివాలయం డిప్లాయ్‌మెంట్ ప్లాన్, క్లాప్ వాహనాల రూట్ మ్యాప్, యాక్షన్ ప్లాన్ సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. దీర్ఘ కాలంగా విధులకు దూరంగా ఉన్న పారిశుధ్య కార్మికుల వివరాల జాబితా సిద్ధం చేసి, అందుకు ప్రత్యామ్నాయంగా తదుపరి చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్లు కె.శివప్రసాద్, బి.రాముకు ఆదేశించారు. నరసింహనగర్ రైతు బజార్ వద్ద జనసంచారం అధికంగా ఉన్నందున అదే స్థాయిలో పరిసర ప్రాంతాల్లో కూడా వ్యర్థాలు ఎక్కువగా ఉంటాయని, ఉదయం, సాయంత్రం రెండు పూటలా వ్యర్థాలు తరలించేలా నిత్యం చర్యలు చేపట్టాలని ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్‌ను ఆదేశించారు. క్లాప్ వాహనాల నిర్వహణ కాంట్రాక్టర్‌తో మాట్లాడుతూ వాహనాల రాకపోకల్లో ఇబ్బందులు లేకుండా, డ్రైవర్లు సమయానికి వ్యర్థాలు సేకరించేలా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పర్యటనలో శానిటరీ సూపర్‌వైజర్ జనార్దన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ క్రాంతి, వార్డు సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్‌లో హిందీ దివస్



హిందీ పత్రికను ఆవిష్కరిస్తున్న అతిథులు, విద్యార్థులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో హిందీ విభాగాధిపతి డాక్టర్ పి.కె.జయలక్ష్మి నేతృత్వంలో మంగళవారం హిందీ వారోత్సవాలు నిర్వహించారు. నెహ్రూ యువ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ మహేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ షైజీ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ మహేశ్వరరావు మాట్లాడుతూ రాజ్యభాష హిందీ ప్రాముఖ్యతను తెలిపారు. హిందీ సాహిత్య భారతి, విశాఖ యూనిట్ నెహ్రూ యువకేంద్రం, భారత ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు వాద వివాదం, వ్యాస రచన, కవితా పఠనం, ప్రశ్నోత్తర పోటీలు, సాహిత్య, సాంస్కృతిక పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు నృత్యరూపకాలు ఆకట్టుకున్నాయి. అనంతరం హిందీ పత్రిక 19వ సంచికను అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్. దీప్తి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

తాటిచెట్లపాలెం: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజుకు సీతమ్మధారలో గల ఆయన కార్యాలయంలో మంగళవారం వినతిపత్రాలను సమర్పించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏపీ భవన, ఇతర నిర్మాణ సంక్షేమ బోర్డులలో సభ్యులుగా ఉన్న కార్మికుల 50 వేల క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిపై ఎన్నికల ముందు యూనియన్ తరఫున కూటమి నాయకులకు వినతిపత్రాలు సమర్పించామని ఎమ్మెల్యేకు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు 16 నెలలు కావస్తున్నా ఇంత వరకు క్లెయిమ్‌లు పరిష్కరించలేదని వాపోయారు. వీటిపై ఇప్పటి వరకు మంత్రులకు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు ఇచ్చామని, ధర్నాలు చేసి అధికారులకు వినతిపత్రాలను సమర్పించామని, పీజీఆర్ఎస్‌లో కూడా ఫిర్యాదులు చేసినా ప్రయోజనం లేకపోయిందన్నారు. అనంతరం ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరచిన విధంగా కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వీరు తెలిపారు. కార్యక్రమంలో కోట సత్తిబాబు, ఎస్.సాయిబాబా, బోర రమణ, నాగేశ్వరరావు, నారాయణరావు, అప్పలరాజు, వాసు పాల్గొన్నారు.

వీవోఏలకు జీతాలు చెల్లించకపోవడం దారుణం

సమస్యలు పరిష్కరించాలని డీఆర్‌డీఏ కార్యాలయం ఎదుట నిరసన



డీఆర్‌డీఏ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న వీవోఏలు తదితరులు

ఎంవీపీ కాలనీ: విధి నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా వీవోఏలు నిరసనకు దిగారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ఎంవీపీ కాలనీలోని డీఆర్‌డీఏ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ వీవోఏల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వివక్షపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. 3 నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని, మూడేళ్ల కాల పరిమితి సర్క్యులర్‌తో ఉద్యోగులను వేధిస్తోందన్నారు. వేతనాల పెంపు కోసం పెద్ద ఎత్తున విజ్ఞప్తులు చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. పైగా కొత్త సెల్ ఫోన్లు అందించకుండా పాత వాటితోనే 26 రకాల యాప్ వర్కులు చేయాలని ఒత్తిడికి గురి చేస్తోందన్నారు. ఇప్పటికైనా వీవోఏల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం స్పందించాలన్నారు. వేతనాలు పెంచడంతోపాటు కొత్త ఫోన్లు అందించాలని, ఆర్పీలు మాదిరిగానే 3 ఏళ్ల కాల పరిమితి జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ నెల 24న జరిగే రాష్ట్ర స్థాయి సమావేశంలోపు సమస్యలు పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధమవుతామని వీవోఏల సంఘం జిల్లా అధ్యక్షురాలు అపర్ణ హెచ్చరించారు. అనంతరం డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతికి సమస్యల పరిష్కారంపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మణి, కంచమ్మ, శ్రీలక్ష్మి, పార్వతి, శారద, శ్యామల, వెంకటలక్ష్మి, గౌరి పాల్గొన్నారు.

దళిత యువకులపై దాడి అమానుషం



నిరసన తెలుపుతున్న దళిత సేన నాయకుడు గొల్లమాల అప్పారావు, తదితరులు

కంచరపాలెం: దళిత యువకులపె దాడి చేసిన జనసేన నాయకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు డిమాండ్ చేశారు. ఊర్వశి కూడలిలోని దళిత సేన ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఏలూరు జిల్లా కై కలూరు మండలం దాన గూడెం గ్రామంలో జరిగిన ఘటనను నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గొల్లమాల అప్పారావు మాట్లాడుతూ గొంతుపులి దినేష్, పి.అజయ్‌పై కులం పేరుతో దూషిస్తూ జనసేన పార్టీకి చెందిన కాపు కుల పెద్దలు దాడి చేయడం అమానుషం అన్నారు. పోలీస్ స్టేషన్‌లో కూడా కేసు నమోదు చేయకుండా దళితులను చిన్న చూపు చూడడం సరి కాదన్నారు. దళితులను మూడు రోజులుగా మంచినీటి కోసం గ్రామాల్లోకి కూడా రానివ్వకుండా అడ్డుకోవడం దారుణం అన్నారు. దళితసేన బాధితుల పక్షాన అండగా నిలబడుతుందని గొల్లమాల అప్పారావు తెలిపారు. కార్యక్రమంలో దళితసేన నగర అధ్యక్షుడు పుచ్చ కామేశ్వరరావు, తాటిపూడి సీతారామ్, గొల్లమాల మీనా, చింతాల మల్లికార్జునరావు, లంక రామారావు, రాంజీ అభ్యుదయ సేవా సంఘం అధ్యక్షుడు ఆర్ వెంకటరావు, సంఘం నాయకులు బైరవమూర్తి, బొత్స అప్పారావు, టి.గణేష్, ఎ.సుబ్రహ్మణ్యం, నీళ్ల గణేష్, ధనాల అప్పారావు, కొణతాల ప్రేమానందం, దళితసేన కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకర గోతులతో ఇబ్బందులు



శ్యామలాంబ ఆర్చి వద్ద ఏర్పడిన గోతులు

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీలో నాగరాజు ఎన్‌క్లేవ్ సమీపంలో రోడ్డు మధ్యలో ఏర్పడిన గొయ్యి ప్రమాదకరంగా మారింది. అలాగే శంకరమఠం రోడ్ నుంచి శ్రీలలితాపీఠానికి వెళ్లే మార్గంలో శ్యామలాంబ ఆర్చి వద్ద రెండు గోతులు ప్రమాదకరంగా మారాయి. వాహనచోదకులు గోతులతో ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కోసారి బైక్‌లు స్కిడ్ అయి ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గోతులను పూడ్చేలా తగు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



ఎన్జీజీవోస్ కాలనీలో ఏర్పడిన గొయ్యి

అదనపు బస్సుల పెంపునకు చర్యలు చేపట్టాలి

దాబాగార్డెన్స్: విశాఖ జిల్లాలో ప్రయాణికులకు తగ్గట్టుగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచి, ప్రజల కష్టాలు తీర్చాలని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి మరడాన జగ్గనాయుడు డిమాండ్ చేశారు. నగరంలోని జగదాంబ జంక్షన్ సమీపాన ఉన్న సీపీఎం కార్యాలయంలో మంగళవారం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.కృష్ణారావు, ఆర్‌కేఎస్‌వీ కుమార్‌తో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం పేరిట మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిందని, దీనిని సీపీఎం స్వాగతిస్తోందన్నారు. అయితే ప్రస్తుత బస్సులతోనే ఈ పథకం అమలు చేయడం వల్ల ప్రయాణికులు, ముఖ్యంగా సీనియర్ సిటిజన్లు, వికలాంగులు, పిల్లలు, విద్యార్థులు, పురుషులు తీవ్ర ఇబ్బందులు పడతున్నారన్నారు. గంటల తరబడి నిలబడి ప్రయాణించాల్సి వస్తుందని, ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.